సాక్షి అనంతపురం

శనివారం । 28 । అక్టోబర్ । 2023



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి.



నేడు ఆలయం మూసివేత

పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.



జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.7,020తో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. పత్తి పంట కొనుగోలుపై జేసీ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. పత్తిపంట కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఏర్పాట్లు చేస్తోందన్నారు. రెండుమూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రకటించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో నవంబరు ఒకటో తేదీ నుంచి రైతుల రిజిస్ట్రేషన్ ప్రారంభించాలన్నారు. రైతులెవరూ తక్కువ ధరకు పత్తి పంట అమ్ముకుని నష్టపోకుండా చూడాలన్నారు. సమావేశంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఏడీ చౌదరి, కాటన్ కార్పొరేషన్ వాణిజ్య అధికారి బాల నరసింహ నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో బదిలీలు



అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని పలువురు ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలికిరిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎస్.దేవన్నను అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. పులివెందుల నుంచి జీఎస్ఎస్.రాజు జేఎన్‌టీయూ(అనంతపురం) అడిషనల్ కంట్రోలర్‌గా బదిలీ అయ్యారు. పరీక్షల విభాగం నుంచి కె.జయలక్ష్మిని జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు, కలికిరి ప్రొఫెసర్ నాగప్రసాదనాయుడును అక్కడే మెకానికల్ విభాగాధిపతిగా బదిలీ చేశారు. కలికిరి అసిస్టెంట్ ప్రొఫెసర్ డీఆర్ శ్రీనివాస్‌ను జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. ఓటీపీఆర్ఐ ఫుడ్‌టెక్నాలజీ ప్రొఫెసర్ ఎ.స్వరూపరాణి అక్కడే విభాగాధిపతిగా బదిలీ అయ్యారు. ప్రొఫెసర్ ఎ.పి.శివకుమార్‌ను యూనివర్సిటీ ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావును కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. కలికిరి ప్రిన్సిపాల్ ఎస్.వైశాలిని జేఎన్‌టీయూ(ఏ) ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ డైరెక్టర్‌గా, ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డిని పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఆర్.వసుంధరను జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు.

ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలి



ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం: పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, పరికరాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగుండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులకు ఆయుధాలు, వాటి పనితీరు గురించి వివరించారు. పోలీసుల పరాక్రమ విధులు తెలిపే క్రాక్ సినిమాను విద్యార్థులకోసం ఉచితంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈ-క్రాప్, ఈ-కేవైసీ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్-2023లో సాగైన వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ ముగిసింది. గ్రామసభలు, సామాజిక తనిఖీ తర్వాత ఈ నెల 31న ఈ-క్రాప్ తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపడానికి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని రకాల పంటలు 9.91 లక్షల ఎకరాల్లో సాగైనట్లు ఈ-క్రాప్ నమోదు చేశారు. వ్యవసాయ పంటల సాగులో వజ్రకరూరు, ఉద్యాన పంటల సాగులో గార్లదిన్నె మండలాలు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.

'పచ్చ' మట్కా మాఫియా

తాడిపత్రిలో చీకటి మాటున మట్కా మాఫియా రాజ్యమేలుతోంది. ఒకప్పటి జూదరులు ఇప్పుడు బుకీలుగా అవతారమెత్తి చోటా మట్కా డాన్‌తో కలిసి అమాయక ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపెడుతున్నారు. డబ్బు ఆశ చూపి వారిని రొంపిలోకి లాగుతున్నారు. అత్యాశకు పోయిన సామాన్యులు జేబులకు చిల్లు వేసుకుంటున్నారు.

- తాడిపత్రిలో మళ్లీ మట్కా హవా
- ఆన్‌లైన్ వేదికగా సాగుతున్న ఆట
- పోలీసుల చర్యలకు బెదరని డాన్లు
- చోటా డాన్ రజాక్, ఖాజాలకు జేసీ సోదరుల అండ!





జేసీ ప్రభాకర్‌రెడ్డితో చోటాడాన్ రజాక్, మకందర్ ఖాజా అలియాస్ లప్ప ఖాజా (ఫైల్)

తాడిపత్రి అర్బన్: మట్కా మహమ్మారి అంకెల గారడీతో అమాయకులను బురిడీ కొట్టిస్తోంది. మట్కా తగిలితే రూపాయికి రూ.80 ఇస్తామని ఆశ చూపిస్తోంది. దీంతో ఎంతోమంది కూలీనాలీచేసుకునే వారు, వ్యాపారులు, చిరుద్యోగులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు, సులభంగా డబ్బు సంపాదించుకునేందుకు మట్కాను ఎంచుకుంటున్నారు. పోలీసులు మట్కాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నా టీడీపీ నేతల అండదండలున్న నిర్వాహకులు తమ పంథాను మాత్రం మార్చుకోవడం లేదు. కేరళ నుంచి వలస వచ్చి స్థిరపడిన వ్యక్తి ఈ ప్రాంతానికి మట్కాను పరిచయం చేశాడు. ఆ వ్యక్తి కుమారుడైన రషీద్ మట్కా పగ్గాలు చేపట్టాక అనతికాలంలోనే డాన్‌గా ఎదిగాడు. టీడీపీకి చెందిన జేసీ సోదరుల (మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి - మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి)ఆశీస్సులుండడమే ఇందుకు కారణమన్న విమర్శలు ఉన్నాయి.

తెరపైకి చోటా డాన్ రజాక్

మట్కా డాన్ రషీద్ కరోనాతో మృత్యువాతపడ్డాక పట్టణంలో మట్కా కొన్నాళ్లు మరుగున పడింది. తన అన్న (ఎల్లో డాన్) వారసత్వాన్ని అబ్దుల్ రజాక్ కొనసాగించడంతో మట్కా తిరిగి పుంజుకుంది. గతంలో బళ్లారికి చెందిన రిజ్వాన్‌ను శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. రిజ్వాన్ ఇచ్చిన సమాచారంతో ఎస్పీ టీం అప్పట్లో అబ్దుల్ రజాక్‌ను అదుపులోకి తీసుకుంది. కర్ణాటకలోని హుబ్లీకి చెందిన వినాయక్ మేత్రాని అనే మట్కా నిర్వాహకుడిని కూడా పోలీసులు అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. అయితే రిజ్వాన్, వినాయక్ మేత్రాని అనే వీరిరువురు సౌత్ ఇండియాలోనే మట్కా కంపెనీల్లో నంబర్ వన్ షేర్‌హోల్డర్స్. వీరిలో రిజ్వాన్‌కు తాడిపత్రికి చెందిన అబ్దుల్ రజాక్ మట్కా పట్టీలు ఇచ్చేవాడని అప్పట్లో పోలీసులు గుర్తించారు.

మట్కారాయుళ్లపై కొరడా

ఎన్నడూ లేని విధంగా తాడిపత్రి పోలీసులు మట్కా రాయుళ్లపై కొరఢా ఝళిపిస్తున్నారు. అర్బన్ సీఐగా పి.హమీద్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మట్కాపై ఉక్కుపాదం మోపారు. పట్టణంలో మట్కా ఎవరు నిర్వహిస్తున్నారన్న దానిపై ఆరా తీసి వారికి ముందుగా హెచ్చరికలు జారీ చేశారు. తీరు మార్చుకోని వారిని జిల్లా నుంచి బహిష్కరించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కలెక్టర్ గౌతమి ఉత్తర్వుల మేరకు మట్కా నిర్వాహకులు బుక్కపట్నం శివకుమార్, చుక్కలూరు చాంద్‌బాషా, మక్తుం పాల మాబు, దూదేకుల కుళ్లాయప్ప, ఉదయగిరి మాబున్నీ, దిగువపల్లి పుల్లయ్య, తుంగ రామాంజులరెడ్డిలపై ఆరు నెలల పాటు జిల్లా బహిష్కరణ వేటు వేశారు.

టీడీపీకి చెందిన మరో మట్కా డాన్ మకందర్ ఖాజా అలియాస్ లప్ప ఖాజా కుటుంబం మొత్తం తాడిపత్రిలో మట్కా పురుడు పోసుకున్నప్పటి నుంచి మట్కా నిర్వహిస్తుండడం విశేషం. వీరి కుటుంబంలో మహిళలే మట్కా నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు కూడా గుర్తించారు. ఇటీవల మకందర్ ఖాజా తండ్రి మునీర్‌బాషాతో పాటు ఖాజా సతీమణి షేక్ నూరీని అరెస్టు చేశారు.

పోలీసులనే టార్గెట్ చేసి..

తాడిపత్రి పచ్చ మట్కా మాఫియాలో కీలక సూత్రధారి రషీద్ సోదరుడు అబ్దుల్ రజాక్‌ను కొద్ది రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మట్కాను పూర్తిస్థాయిలో ఆపాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అబ్దుల్ రజాక్ కుటుంబం ఏకంగా పోలీసులనే టార్గెట్ చేసింది. సీఐ హమీద్‌ఖాన్ తమను వేధిస్తున్నాడంటూ మొసలి కన్నీరు కార్చింది.

తెరవెనుక 'పచ్చ' కుట్ర

మట్కా మాఫియాను ఇన్నాళ్లూ పెంచి పోషించిన 'పచ్చ' నేతలకు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ చర్యలు మింగుడుపడడం లేదు. ఈయన ఉంటే తమ ఆటలు సాగవని భావించిన 'పచ్చ' నేతలు బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల చోటా డాన్ అబ్దుల్ రజాక్ భార్యతో పోలీసు శాఖలోని కీలక అధికారులపై ఆరోపణలు చేయిస్తున్నారు. మానవ హక్కుల సంఘం, ప్రైవేటు కేసుల పేరుతో పోలీసులను బ్లాక్‌మెయిల్ చేసి మట్కాను సాగించాలని పథకం రచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో మట్కా

సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నిర్వాహకులు మట్కాను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. కొందరు మట్కా నిర్వాహకులు స్వయంగా యాప్ డెవలపర్స్.. మిలాన్‌డే, మిలాన్ నైట్ పేర్లతో ప్రత్యేక వెబ్‌సైట్లు రూపొందించి యాప్‌ల ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్లకు లింక్‌లను పంపి గుట్టుగా మట్కా నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను సదరు ఆండ్రాయిడ్ యూజర్ రూ.10 వేలు నగదు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్‌దారుకు ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. ఆ పాస్‌వర్డ్ ఉపయోగించి మట్కా నిర్వహించుకోవాలి. రూ.100కు రూ.8వేలు చెల్లిస్తామంటూ అమాయకుల బతుకులను నాశనం చేస్తున్నారు.

ఉపేక్షించేది లేదు

మట్కా విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఎక్కడైనా, ఎప్పుడైనా మట్కా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి. నేను బాధ్యతలు తీసుకున్నాక ఇప్పటి వరకు మట్కా స్థావరాలపై దాడులు జరిపి, 33 కేసులు నమోదు చేశాం. మట్కా, గ్యాంబ్లింగ్‌ను కూకటివేళ్లతో పెకలించాలని సీఐ, ఎస్ఐలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఆన్‌లైన్ మట్కాను కూడా నిర్మూలిస్తాం.

– సీఎం.గంగయ్య, డీఎస్పీ, తాడిపత్రి

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అనంతపురం అర్బన్: ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. డిప్యూటీ కలెక్టర్ జి.శంకరయ్యను చిత్తూరు జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా ఉన్న బి.సుధారాణిని తిరిగి అదే స్థానంలో నియమించారు. ఇటీవల గుంతకల్లు ఆర్డీఓగా నియమించిన కె.అనురాధ బదిలీని రద్దు చేస్తూ ఆమెను కర్నూలు ఎస్ఎస్‌పీ ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా నియమించారు.

తహసీల్దార్లకు డిప్యుటేషన్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఐదుగురు తహసీల్దార్లను డిప్యుటేషన్‌పై వివిధ స్థానాల్లో నియమిస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయ ఏఓగా ఉన్న బి.వాణిశ్రీని బ్రహ్మసముద్రం తహసీల్దారుగా, అక్కడ ఉన్న ఎం.బాలకిషన్‌ను అనంతపురం అర్బన్ తహసీల్దారుగా నియమించారు. రాయదుర్గం తహసీల్దారు జి.మారుతిని అనంతపురం కేఆర్ఆర్‌సీ తహసీల్దారుగా, బెళుగుప్ప తహసీల్దారు హెచ్.ఓబులేసుకు రాయదుర్గం తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నార్పల తహసీల్దారు టి.నారాయణ స్వామిని (సెలవులో ఉన్నారు) ఫారిన్ సర్వీసెస్ కింద డ్వామాలో నియమించారు.

కృత్రిమ చేతులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: మోచేయి నుంచి నాలుగు అంగుళాల చేతుల గల దివ్యాంగులకు రోటరీ క్లబ్ (మంగళగిరి) కృత్రిమ చేతులు పంపిణీ చేయనుందని, అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 7207403150 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తు తీసుకున్న అర్హులకు డిసెంబర్ 10న మంగళగిరిలో కృత్రిమ చేతులు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ పార్సిల్ (కార్గో) సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో డోర్‌డెలివరీకి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 25 వరకు మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, హిందూపురం, కదిరి, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో తొలివిడతగా కార్గో సేవలను ఇంటి వద్దకు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

రిజర్వేషన్లు గొప్ప వరం

- ఫెర్రర్ దళితులు, గిరిజనుల్లో ఆత్మగౌరవం పెంచారు
- మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి : మంత్రి ఉషశ్రీచరణ్



అంబేడ్కర్, విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, మాంఛో ఫెర్రర్

కంబదూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు బడుగు, బలహీన వర్గాలకు గొప్ప వరమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. అండేపల్లిలో శుక్రవారం ఆమె ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌తో కలిసి అంబేడ్కర్, ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌ల విగ్రహాలను ఆవిష్కరించారు. తొలుత గ్రామస్తులు కలశాలు, డప్పువాయిద్యాలతో అతిథులకు స్వాగతం పలికారు. విగ్రహావిష్కరణ సభలో మంత్రి మాట్లాడుతూ అండేపల్లిలో ఒకే చోట ఇద్దరు మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించడం శుభపరిణామమన్నారు. యువత మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ, వారి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బడుగు బలహీన వర్గాలు, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తాను మంత్రి హోదా అనుభవిస్తున్నానంటే రిజర్వేషన్ పుణ్యమేనని చెప్పారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కరువు పీడిత అనంతపురం జిల్లాలోని పేదలకు విద్య, వైద్యం, ఇళ్ల నిర్మాణం తదితర ఎన్నో సేవలందించారని కొనియాడారు. దళితులు, పేదల ఆత్మగౌరవం పెంచారన్నారు. అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతం ఫాదర్ కుటుంబానికి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిందన్నారు. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి పెద్దదైనా.. కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి రోగులు అధికంగా వచ్చి వైద్య సేవలు పొందుతుండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, ఆర్డీటీ ఆర్డీ సుబ్బారావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ రామ్మోహన్, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైస్ ఎంపీపీ భీమేష్, సర్పంచులు సంధ్య, బాపూజీ, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, నాయకులు హరినాథ్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, జేసీఎస్ కన్వీనర్ భట్టువానిపల్లి అంజి, నాగరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, సత్యనారాయణ శాస్త్రి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఐక్యత చాటుదాం

- 'అనంత'లో నేడు రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవం
- బోనాలతో ర్యాలీ
- జయప్రదం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపు



వాల్మీకి జయంత్యుత్సవ ఏర్పాట్లలో మహిళలతో కలిసి పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: వాల్మీకులు ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అనంతపురం వేదికగా శనివారం నిర్వహించతలపెట్టిన రాష్ట్రస్థాయి వాల్మీకుల జయంత్యుత్సవాలకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వాల్మీకులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం నిర్వహించే సభావేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం సైనిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జల్లా శ్రీనివాసులుతో కలసి ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమాల ఏర్పాట్లలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మూడోసారి జిల్లాలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జనాభా పరంగా వాల్మీకులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ముందుగా అనంతపురంలోని పాతూరులో గల పవర్ ఆఫీసు వద్దనున్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమానికి దాదాపు వెయ్యి మంది మహిళలు బోనాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్కడి నుంచి జేఎన్‌టీయూ రోడ్డులో గల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్దనున్న కేఎస్ఎన్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకుల సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శన స్థలానికి చేరుకుంటారన్నారు.

జిల్లా ఓటర్లు 19,77,660

- పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికం
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల



ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్ఓ గాయత్రీదేవి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, తదితరులు

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	1,29,342	1,29,456	28	2,58,826
ఉరవకొండ	1,08,848	1,09,761	28	2,18,637
గుంతకల్లు	1,32,215	1,34,743	76	2,67,034
తాడిపత్రి	1,21,372	1,21,186	25	2,42,583
శింగనమల	1,21,725	1,21,699	19	2,43,443
అనంతపురం	1,34,295	1,38,295	41	2,72,695
కళ్యాణదుర్గం	1,14,355	1,13,769	5	2,28,129
రాప్తాడు	1,23,436	1,22,867	10	2,46,313
మొత్తం	9,85,652	9,91,776	232	19,77,660

అనంతపురం అర్బన్; ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి విడుదల చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవితో కలిసి ముసాయిదా ఓటర్ల జాబితాలను నియోజకవర్గాల ఎన్నికల డీటీలకు అందజేశారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని 2,213 పోలింగ్ కేంద్రాల పరిధిలో 19,77,660 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,85,652 మంది, మహిళా ఓటర్లు 9,91,776 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 232 మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 6,124 మంది అధికంగా ఉన్నారు.

పెరిగిన ఓటర్ల సంఖ్య 38 వేలు

ఈ ఏడాది జనవరి 5న విడుదల చేసి తుది ఓటర్ల జాబితా మేరకు జిల్లాలో 19,39,163 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు జిల్లాలో 19,77,660 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ప్రకారం జిల్లాలో 38,497 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో పురుష ఓటర్లు 17,811 మంది, మహిళా ఓటర్లు 20,678 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు ఎనిమిది మంది ఉన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసిన రోజు నుంచి ఈ ఏడాది డిసెంబర్ 9 వరకు కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలనూ సమర్పించవచ్చు. వచ్చిన క్లెయిమ్‌లను, అభ్యంతరాలను డిసెంబరు 26లోగా పరిష్కరిస్తారు. 2024 జనవరి 5వ తేదీ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

అభ్యంతరాలను డిసెంబరు 9లోగా తెలపాలి

ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 9లోగా తెలియజేయాలని కలెక్టర్ గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ముసాయిదా జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల పెంపు, తదితర అంశాలపై కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిర్దేశించిన తేదీలోగా తెలియజేస్తే వాటి పరిశీలన డిసెంబరు 26 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో 2,198 పోలింగ్ కేంద్రాలు ఉండగా, హేతుబద్ధీకరణలో భాగంగా 2,213కి పెరిగాయన్నారు.

మాదక ద్రవ్యాలపై నిఘా పెంచాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు నిఘా పెంచాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ జిల్లా కమిటీ, బాల్య వివాహాల నివారణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ, ఎక్సైజ్ అండ్ సెబ్ కో-ఆర్డినేషన్, రహదారి భద్రతపై సమావేశాలను వేరు వేరుగా నిర్వహించి అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా అడ్డుకట్టకు చెక్‌పోస్టులు, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సందీప్ కృపాకర్, ఏఎస్పీ హనుమంతు, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఆర్డీఓ గ్రంధి వెంకటేశ్, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి


సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో నూతన పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన స్థలాల గుర్తింపు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా పథకాల కింద లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్టాండ్ అప్ ఇండియా పథకం కింద పరిశ్రమలు ఏర్పాటకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని చెప్పారు. లక్ష్యాలను చేరుకోవడంలో పారిశ్రామిక సంఘాలు చేయూతనివ్వాలన్నారు. బ్యాంకులతో సమన్వయం చేసుకుని రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంకు సూచించారు.

సబ్సిడీ మంజూరుకు ఆమోదం

జిల్లాలో 'జగనన్న బడుగు వికాసం' కింద రెండు యూనిట్లకు రూ.22.79 లక్షల సబ్సిడీకి కమిటీ ఆమోదం తెలిపింది. అదే విధంగా 2015–20 ఇండస్ట్రియల్ పాలసీ కింద మూడు యూనిట్లకు రూ.16.22 లక్షలు, 2020–23 ఇండస్ట్రియల్ పాలసీ కింద మూడు యూనిట్లకు రూ.1.57 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం లభించింది. సింగిల్ విండో పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను గడువులోగా ఆమోదించాలని ఫ్యాక్టరీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పీఎంఈజీపీ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామికవాడలో పరిశ్రమలకు కేటాయించిన ప్లాట్లలో యూనిట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. రాప్తాడు ఎంఎస్ఎంఈ పార్కులో స్థాపించే యూనిట్ల ప్రగతి నివేదిక ప్రతి నెలా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు, ఎల్‌డీఎం సత్యరాజ్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఈఈగా శంకరయ్య


శంకరయ్య

అనంతపురం సిటీ: సర్వశిక్షాభియాన్ (ఎస్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా శంకరయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం పంచాయతీరాజ్‌శాఖ కళ్యాణదుర్గం డీఈఈగా పని చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్ఎస్ఏ పూర్తి అదనపు బాధ్యతలతో ఈఈగా నియమితులైన శంకరయ్య.. అనంతపురం జిల్లాలోనూ అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఒకట్రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

'జగనన్న సురక్ష'కు స్పందన

- సద్వినియోగం చేసుకోవాలన్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి


గుత్తి మండలం చెట్నేపల్లిలో జరిగిన వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం జిల్లాలోని 14 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. 6,247 ఓపీ సేవలు పొందగా, అందులో 1053 మంది వైఎస్సార్ కంటి వెలుగు కింద పరీక్షలు చేయించుకున్నారు. స్పెషలిస్టు వైద్యులు 195 మందిని జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గుత్తి చెట్నేపల్లిలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి పరిశీలించారు. శిబిరాలకు వచ్చే వారిని ఓపిగ్గా పరీక్షించి, వారి సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఓపీ, రెఫరల్, రక్త పరీక్షల రికార్డులను పరిశీలించారు.

నేడు 11 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలోని కక్కలపల్లి కాలనీ–2, సనప, నరసాపురం, వేపలపర్తి, అయ్యగార్లపల్లి, నడిమిదొడ్డి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో, అనంతపురం రెండో రోడ్డు, వేణుగోపాల్‌నగర్, గుత్తి చెట్నేపల్లి, గుంతకల్లు భాగ్యనగర్, తాడిపత్రి పాతకోట వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శనివారం వైద్య శిబిరాలుంటాయని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ ప్రిన్సిపాల్ మా కొద్దు!

- అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ధర్నా


కాలేజీలో ధర్నాకు దిగిన అధ్యాపకులు, విద్యార్థులు

గుత్తి: 'ప్రిన్సిపాల్ వేధింపులు భరించలేకున్నాం. ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు' అంటూ గుత్తి ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది శుక్రవారం కాలేజీలో ధర్నాకు దిగారు. వారి వివరాలమేరకు.. ఇటీవలే సంజీత్‌నాయక్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు తీసుకున్న రోజు నుంచే అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించడం ప్రారంభించాడని వారు ఆరోపించారు. ఏదో ఒక కారణంతో అధ్యాపకులను, విద్యార్థులను, సిబ్బందిని వేధిస్తున్నారన్నారు. గతంలో పని చేసిన కాలేజీల్లో కూడా ఇలాగే ప్రవర్తించడంతో రెండు, మూడు సార్లు ఆయన సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది. ధర్నా అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పోలీసు స్టేషన్‌కు వెళ్లి ప్రిన్సిపాల్‌పై సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేయగా ఆయన విచారణ చేపట్టారు.

నవంబర్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అనంతపురం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నవంబర్ 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.నరసింహారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, టోర్నమెంట్ డైరెక్టర్ ఏ. ఉదయ్‌కుమార్‌నాయుడు, టోర్నమెంట్ స్పాన్సర్ రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 210 మంది చెస్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆరు నుంచి 16 సంవత్సరాల వయస్సు వరకు అండర్–6 , అండర్– 8, అండర్–10, అండర్–12, అండర్–14, అండర్–16 విభాగాల్లో బాల, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నవంబర్ 15వ తేదీలోపు www.apchess.org అనే వైబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు

బుక్కరాయసముద్రం: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవు అని విజిలెన్స్ సీఐ రామారావు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని రసాయన మందుల షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ రామారావు మాట్లాడుతూ కాలం చెల్లిన మందులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకూడదని, అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, అధిక ధరలకు మందులు అమ్మకూడదని సూచించారు. ఈ సందర్భంగా అన్నదాత దుకాణంలో రూ.28,288 విలువ గల కాలం చెల్లిన మందులను సీజ్ చేశారు. ఉమేష్ చంద్ర ఎరువుల దుకాణంలో రూ.36,700 విలువ మందులకు రికార్డులు లేకపోవడంతో అమ్మకాలు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. శనివారం తాను ఆత్మకూరు మండలంలో పర్యటించనున్నట్లు విద్యాశాఖ అధికారులకు సమాచారం పంపారు. వివిధ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. విద్యార్థులతోనూ ముచ్చటించనున్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించిన సమయంలో ఈ జిల్లాకు వస్తారని విద్యాశాఖ వర్గాలు భావించినా ఇక్కడికి రాకుండానే వెళ్లిపోయారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఖరారు కావడంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ అప్డేట్ చేయించాలని, విద్యార్థులకు సంబంధించిన వివిధ పరీక్షల మార్కుల నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఎఫ్ఏ–2 సమాధాన పత్రాలు విద్యార్థులకు ఇచ్చి ఉండాలని పేర్కొన్నారు. నవంబరు 3న జరిగే స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే–2023 పాఠశాల స్థాయి పరీక్షకు ప్రతి విద్యార్థినీ సిద్ధం చేయాలని సూచించారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్‌టీవీలు సక్రమంగా వినియోగించేలా చూడాలని పేర్కొన్నారు. బైజూస్ ట్యాబ్‌లు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు తెచ్చుకునేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ట్యాబ్‌లోనూ మూడు యాప్‌లు ఉండేలా అప్‌డేట్ చేయాలన్నారు. టోఫెల్‌కు సంబంధిన సమాచారాన్ని అప్‌డేషన్‌లో ఉంచుకోవాలన్నారు. పాఠశాల సమగ్ర సమాచారాన్ని డిస్‌ప్లే బోర్డులో నమోదు చేయాలని పేర్కొన్నారు. వందశాతం జీఈఆర్ కోసం మీ వంతు కృషిని తెలియజేయడానికి సిద్ధంగా ఉండాలని అప్రమత్తం చేశారు. పాఠశాల సక్సెస్ స్టోరీలను డిస్‌ప్లే చేయాలన్నారు. ప్రతివారం తరగతి బెస్ట్ స్టూడెంట్ పేరును నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలన్నారు. జగనన్న గోరుముద్దను సక్రమంగా పాటించాలని తెలిపారు. మెనూపై ప్రతి ఉపాధ్యాయుడికీ అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు సకాలంలో నమోదు చేయాలని తెలిపారు. తరగతి గదులను, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద జరిగిన అభివృద్ధి పనులు, ఖర్చు వివరాలను నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలని తెలిపారు.

ఏ పాఠశాలకు వస్తారో?

ఆత్మకూరు పర్యటన అని అధికారికంగా తెలియజేసినా జిల్లాకు వచ్చిన తర్వాత ఏ పాఠశాలకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వస్తారోనన్న ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొంది. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు అప్రమత్తం అయ్యారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

అనంతపురం కల్చరల్: హిందూ ముస్లింలు మహిమాన్వితంగా విశ్వసించే మాబుసుబానీ (దస్తగిరి స్వామి) గ్యార్మీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. నగరంలోని శ్రీనివాసనగర్ సమీపం లోని షాహే గౌసే ఆజం ఆసార్ దర్గా వేదికగా మధ్యాహ్నం ఆసార్ ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు దస్తగిరి స్వామి కేశదర్శనం ఏర్పాటు చేయడంతో వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కర్నూలు నుంచి వచ్చిన హజరత్ సయ్యద్ నందాని పాషా ఖాదిరి సాహెబ్, సయ్యద్ షా మహమ్మద్ వజ్యూద్దీన్ ఖాదిర, గుంటూరు నుంచి షాహిద్ రాజ తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు కమిటీ షబ్బీర్ అహ్మద్, సెక్రటరీ, నవీద్‌ఖాన్, అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్‌లో మహబూబ్ సుబానీ కేశ దర్శనం చేసుకుంటున్న మేయర్ వసీం



షాహే గౌసే ఆజం ఆసార్ దర్గాలో ఉరుసు ఉత్సవం



దస్తగిరి స్వామి కేశదర్శనం

నగరంలో ఘనంగా గ్యార్మీ వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని లక్ష్మీనగర్‌లో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో మేయర్ మహ్మద్ వసీం పాల్గొన్నారు. మహబూబ్ సుబానీ కేశ దర్శనం చేసుకున్నారు. కులమతాలకతీతంగా గార్మీ వేడుకలు నిలుస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖాదరియా ఖుమేశియా జహీరుల్లా సాహెబ్, కమిటీ సభ్యులు సుబహాని, మహబూబ్ రజా, వైఎస్సార్‌సీపీ నాయకులు రఫీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాహుగ్రస్త చంద్రగ్రహణం

అనంతపురం కల్చరల్: రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం తలుపులు మూసివేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి తెలిపారు. మధ్యాహ్నం నుంచి మరుసటిరోజు తెల్లవారుజాము వరకు ఆలయంలో ఎలాంటి పూజలు నిర్వహించబడవన్నారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు గ్రహణ పూజలు, ఆలయశుద్ధితో పాటు యథావిధిగా పూజాది కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

ముట్టాలలో కనకదాస జయంతి



కనకదాస జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని ముట్టాలలో కనకదాస జయంతి వేడుకలను శుక్రవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సర్పంచ్ తిరుపాలమ్మ, ఎర్రిస్వామి, కురుబలు ముత్యాలన్న, మల్లన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాల సందర్శన



వేణుగోపాల్‌నగర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వేణుగోపాల్‌నగర్, కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మేయర్ వసీం శుక్రవారం పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందించడమే సీఎం వైఎస్ జగన్ సంకల్పమని అన్నారు. నగరంలో సూపర్ స్పెషాలిటీ అందుబాటులో రావడానికి రూ.30 కోట్ల ప్రభుత్వ వాటా విడుదల చేసినట్లు తెలిపారు. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణ పనులు, కేంద్రం నిధులు రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్, తదితర వాటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు అంకే కుమారమ్మ, బోయ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీసీని కలిసిన ఎంఈఓలు



ఏసీసీ వరప్రసాదరావును సన్మానిస్తున్న ఎంఈఓలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన వరప్రసాదరావును మండల విద్యాశాఖ అధికారులు శుక్రవారం కలిశారు. అందరికీ అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఏపీసీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. గురు ప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు తారా చంద్రనాయక్, కార్యదర్శి ఎస్. ఓబుళపతి, ఆత్మకూరు ఎంఈఓ–2 రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ డీడీ రమేష్ రెడ్డి

రాప్తాడు: గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని పశు సంవర్ధక శాఖ డీడీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం శాస్త్రీయ పద్ధతిలో చేపడితే లాభసాటిగా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు గొర్రెలు, మేకల పెంపకంలో సంప్రదాయ పద్ధతులకు బదులుగా సాంకేతిక పద్ధతులు అలవర్చుకొని అధిక లాభాలు గడించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ రామసుబ్బా రెడ్డి, ప్రశాంతి, పశు వైద్యాధికారి ప్రకాష్, వీఏఎస్ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా కలువల సతీష్

అనంతపురం కల్చరల్: ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా నగరానికి చెందిన కలువల సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు కర్నూలులో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆయనకు ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు టీజీ వెంకటేష్, మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నరామ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు నియామక పత్రమందించారు.

అయోడిన్ ఉప్పు ఆరోగ్యకరం

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: అయోడిన్ ఉప్పు అందరికీ ఆరోగ్యకరమని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. నేషనల్ ఐయోడిన్ డెఫిసియన్సీ డిసార్డర్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేపట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు సాగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ తల్లి గర్భంలోని శిశువు ఎదుగుదలకు అయోడిన్ ఉప్పు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, మలేరియా అధికారి ఓబులు పాల్గొన్నారు.

కుష్టును ప్రారంభదశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం మెడికల్: కుష్టును ప్రారంభదశలో గుర్తించి, వైద్యం అందిస్తే అంగవైకల్యం నివారించొచ్చని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కుష్టు వ్యాధిపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో కుష్టు వ్యాధి స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. కుష్టు వాధిగ్రస్తులను గుర్తించి, వారికి వైద్యం అందించాలన్నారు. అంగవైకల్యం ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సలకు రెఫర్ చయించాలన్నారు. అనంతరం ఉన్నత వైద్య విద్య కోసం వెళ్తున్న డాక్టర్ అన్వర్ బాషాను అధికారులు సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పారామెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సూర్యప్రకాష్, రాముడు పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనులు ప్రారంభం



భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాంనగర్ పార్కు సుందరీకరణలో భాగంగా రూ.27 లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ పనులు పూర్తి కానున్నాయని, రానున్న రెండు నెలల్లో అంతర్గత రోడ్లతో పాటు డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు రామిరెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, చంద్రాయుడు, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

అనంతపురం క్రైం: నగర శివారులోని సాక్షి కార్యాలయం ఎదుట గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని యువకుడు (35 ఏళ్లు) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్ తెలిపిన మేరకు.. మృతుడు ఎవరన్నది తెలియరాలేదు. మృతి చెందిన యువకుడి ఎడమవైపు ఎదపై పద్దు అనే పేరు పచ్చబొట్టు ఉందన్నారు. కుడిచేతికి పసుపు, ఎరుపు రంగు ధారాలు కట్టుకుని ఉన్నాడు. 35 వయసు ఉంటుందని, చామన ఛాయ రంగుతో 5.5 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు అనంతపురం ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆపదలో 'అమ్మ' ఆపన్నహస్తం



ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: పేదలు, అనాథలు, అభాగ్యులు, దివ్యాంగులు, వృద్ధులు.. ఇలా ఎన్నో కుటుంబాలకు 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ ఆసరాగా నిలుస్తోంది. ఆపదలో ఉన్నారని తెలుసుకొని అక్కున చేర్చుకుంటోంది.. పొరుగు జిల్లా నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన దంపతులు ఆపదలో ఉన్నారని తెలుసుకొని ఆపన్నహస్తం అందించి, ఆదుకుంది. రాయచోటికి చెందిన చెన్నకేశవులు, సులోచనమ్మ దంపతులు నగరానికి వలస వచ్చి స్థిరపడ్డారు. ముప్పై ఏళ్ల కొడుకు ఉన్నా అతనికి మతిస్థిమితంలేదు. ఒకరు దినసరి కూలికెళ్తే.. మరొకరు ఇళ్లలో పాచి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఒకరోజు ఉన్నపళంగా సులోచనమ్మకు కిడ్నీ సంబంధిత వ్యాధి ఉందని నిర్ధారణ అయ్యింది. జీవనాధారంగా ఉన్న రెండెకరాల పొలం కూడా అమ్మేసి కట్టుబట్టలతో మిగిలారు. సులోచనమ్మ బంధువుల్లో ఒకామె కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చినా కనీసం వైద్య ఖర్చులకు కూడా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకొని మానవత్వంతో స్పందించిన అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆ కుటుంబానికి రూ.1.50 లక్ష ఆర్థిక సాయం అందించారు. బెంగళూరులోని ఎంఎస్ రామయ్య హాస్పిటల్‌కు వెళ్లడానికి మరో రూ.10 వేలు అంబులెన్సు అద్దె చెల్లించి, వారిని ఆదుకున్నారు. తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ ఇంకా మానవతామూర్తులు పేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు.

తహసీల్దార్ కార్యాలయాలకు సిబ్బంది నియామకం

రాప్తాడురూరల్: నూతనంగా ఏర్పడిన అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు సిబ్బందిని నియమించారు. కలెక్టర్ గౌతమి రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ మండల తహసీల్దార్‌గా ఇటీవల విజయలక్ష్మిని నియమించగా, ఈమె బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఎం.శ్రీనివాసులును అనంతపురం రూరల్ మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా, ప్రస్తుతం అనంతపురం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న దేవన్‌రాజాను కలెక్టరేట్‌లోని ల్యాండ్స్ విభాగానికి బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న పి.మారుతీప్రసాద్‌రెడ్డిని అనంతపురం అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. పెద్దవడుగూరు సీఎస్‌డీటీ పి.శ్రీరాములును అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎలక్షన్ డీటీగా నియమించారు. రూరల్ మండల రీసర్వే డీటీగా టి.దివాకర్‌రెడ్డిని, రూరల్ మండల ఆర్‌ఐగా పి.ప్రశాంత్‌బాబు, అర్బన్ మండల ఆర్‌ఐగా బి.సందీప్‌కృష్ణ, రూరల్ మండల ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా ప్రతాప్‌రెడ్డి, రూరల్ మండల సీనియర్ అసిస్టెంట్‌గా బి.ఈశ్వర్‌రెడ్డి, అర్బన్ మండల సీనియర్ అసిస్టెంట్‌గా పి.విజయభాస్కర్‌రెడ్డి, రూరల్ మండల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా ఎం.వరప్రసన్నకుమార్, అర్బన్ మండల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా ఎస్.మహబూబ్‌బాషాను నియమించారు. కాగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం ఉన్నచోటే కొనసాగనుంది. రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు వివిధ ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

రిలీవ్ అయిన శ్రీధరమూర్తి ...

అనంతపురం మండల తహసీల్దార్‌గా పని చేస్తూ ఉరవకొండకు బదిలీ అయిన శ్రీధరమూర్తి శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఈయన శనివారం ఉరవకొండలో బాధ్యతలు తీసుకోనున్నారు. బ్రహ్మసముద్రం తహసీల్దార్‌గా పని చేస్తున్న బాలకిషన్‌ను అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా నియమించారు. ఈయన బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. కాగా శుక్రవారం అనంతపురం అర్బన్ కార్యాలయ ఆర్‌ఐ సందీప్‌కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ విజయభాస్కర్‌రెడ్డి, రూరల్ మండల సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి విధుల్లో చేరారు.

తాగునీటి పథకాల్లో అక్రమాలపై విచారణ

అనంతపురం సిటీ: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని నీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం, శ్రీసత్యసాయి వాటర్ స్కీం పథకాల అమలులో జరిగిన అక్రమాలపై చేపట్టిన విచారణ ముగిసింది. రెండు స్కీంలలో భారీగా నిధులు పక్కదారి పట్టించడంపై సీఐటీయూ ప్రతినిధులు కలెక్టర్ గౌతమికి పలుమార్లు ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. పని చేస్తున్న కార్మికుల సంఖ్య కంటే ఎక్కువ మంది పేర్లు నమోదు చేసుకొని వారి పేర్లతో వేతనాలు, ఇతర అలవెన్సులు అక్రమంగా డ్రా చేసుకున్న ఉదంతంపై సమగ్ర విచారణ చేయాలంటూ అనేక పర్యాయాలు ఆందోళనలు సైతం నిర్వహించారు. సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ గౌతమి స్పందించారు. పూర్తి స్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆన్‌సెట్ సీఈఓ, డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడును ఆదేశించారు. ఈ మేరకు ఆయన కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, పెనుకొండ, మడకశిర తదితర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. తన దృష్టికి వచ్చిన అంశాలను నివేదిక రూపంలో త్వరలో కలెక్టర్ గౌతమికి అందజేయనున్నట్లు విచారణాధికారి కేశవ నాయుడు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం: ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని విద్యార్థిని తండ్రి ఖాసీంపీరా త్రీటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె సాయంత్రం తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ధరణీకిశోర్ తెలిపారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయండి



బైజూస్ ట్యాబ్‌లను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వరప్రసాద రావు

రాప్తాడు: జిల్లాలో విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఎన్నో అద్భుత విద్యా పథకాలు అమలవుతున్నాయని, వాటిని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అమలుచేసి, విద్యాప్రమాణాలు పెంపునకు కృషి చేయాలని సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వరప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్, ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో నాడు–నేడు ద్వారా చేపడుతున్న పనులు పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్లు, మరుగు దొడ్లు, బైజూస్ ట్యాబ్‌ల పనితీరును ఆయా పాఠశాలల్లో పరిశీలించి, తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయా పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం)ను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేసిందన్నారు. మన బడి నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి, నాణ్యతను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లికార్జున, కుళ్లాయప్ప, హెచ్‌ఎం నరసింహులు, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు గోవింద్ రెడ్డి, గోపాలకృష్ణ, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాల్ బ్యాడ్మింటన్ అండర్–14 బాలుర, బాలికల పోటీలు కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఇండోర్ స్టేడియం అశోక్‌నగర్‌లో జిమ్నాస్టిక్, మల్కంబ్ గేమ్స్ జరిగాయి. 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటల్లో అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి. సుగుణమ్మ, శ్రీ సత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ అంజన్న, జిల్లా కోఆర్డినేటర్ ఎల్.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ బాలికలు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు, జిమ్నాస్టిక్ కాకినాడలో, మల్కంబ్ పోటీలు బాపట్లలో జరగనున్నాయి.

అమృత్ కలశ్‌యాత్రకు అనంత వలంటీర్లు



ఢిల్లీకి బయల్దేరిన ఎన్‌వైకే వలంటీర్లు

అనంతపురం కల్చరల్: ఢిల్లీలో ఈనెల 30,31 తేదీల్లో పెద్ద ఎత్తున జరగనున్న మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొనడానికి శుక్రవారం నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నెహ్రూయువ కేంద్ర డీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో మండలానికి ఒకరు చొప్పున 63 మంది యువతీయువకులు ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. దేశభక్తి ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తుల్లో అమృత్ కలశ్‌యాత్ర దేశానికి గర్వకారణంగా సాగుతుందన్నారు. అంతకు ముందు నెహ్రూ యువకేంద్ర కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు జాతీయ జండాలు పట్టుకొని దేశభక్తి నినాదాలతో ర్యాలీ చేశారు. జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి నరసింహారెడ్డి, యువజన సంక్షేమశాఖ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు భరత్, జీవన్‌కుమార్, జయమారుతి, రమేష్ తదితరులు కార్యక్రమ వివరాలను గురించి మాట్లాడారు.

రేపటిలోపు జాబితా సరిచూసుకోండి



తలుపూరులో జాబితా ప్రదర్శిస్తున్న ఏఈఓ సుజిత

ఆత్మకూరు: 2023 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుల జాబితా గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో సరిచూసుకోవాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు, పంపనూరు, తలుపూరు, ముట్టాల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ నెల 29 వరకు అభ్యంతరాలుంటే రైతులు తెలియజేయాలన్నారు.

ప్రతి విద్యార్థినీ చైతన్యపరచాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మప్రియ

ఆత్మకూరు: విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసి, ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేయాలని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి పద్మప్రియ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. బడిమానేసిన పిల్లలను బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, డీఏఓ ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలన్నారు. రబీలో పంటల సాగుపై వివరించారు. జిల్లాలో వివిధ డివిజన్లలో పంటల సాగు స్థితిగతులపై తెలుసుకున్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, డాక్టర్ రాధిక, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్, సహదేవ, వెంకటరమణ, అప్పారావు, సుధీర్ రెడ్డిపల్లి, కళ్యాణదుర్గం, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులను స్మరించుకుందాం

బుక్కరాయసముద్రం: పోలీసు అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం 14వ ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో రోటరీపురం ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, జంతలూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. ఆయుధాలు ఎలా వాడాలో వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారిపై బెటాలియన్ బ్యాండ్ షో నిర్వహించారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, బీకేఎస్ సీఐ నాగార్జున రెడ్డి, ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ఆర్‌ఐలు రాము, నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతా రామారావు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని చెరువులనూ నింపాలి

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాలోని అన్ని చెరువులకు నీరు విడుదల చేసి, నింపాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పీఏబీఆర్ నుంచి ఉరవకొండ, కూడేరు, గార్లదిన్నె, శింగనమల, రాప్తాడు, ధర్మవరం మీదుగా కెనాల్ ద్వారా చెరువులకు నీరు నింపాలన్నారు. దాదాపు వెయ్యి క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీరు కూడా రాలేదన్నారు. వర్షాభావ పరిస్థితులతో శ్రీశైలం డ్యాంలోనూ నీటి మట్టం తగ్గిపోతోందన్నారు. రాష్ట్రంలో సాగునీటి అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో సమీక్షలు నిర్వహించాలన్నారు. ఈనెల 30న కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల వాసు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రామచరణ్ యాదవ్, గార్లదిన్నె మండల కన్వీనర్ ఓబిరెడ్డి, నగర మైనార్టీ అధ్యక్షుడు శర్మాస్‌వలి, బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాక

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మూసివేత

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం రాత్రి మూసి వేస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి దర్శనం ఉంటుందన్నారు.